## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: భామిని మండలం లోహరజోల గ్రామానికి చెందిన బోనగడ్డి చక్రవర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఈ విషయాన్ని స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి బాధితుడికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం సహాయ నిధి నుంచి రూ.70 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కును వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం బాధితుడికి అందజేశారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాడేల అప్పలనాయుడు, పరజపాడు గ్రామానికి చెందిన శెట్టి రామినాయుడు, గుంట్రెడ్డి సత్తెమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శనివారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ముడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయుకులు తాడేలా మన్మధనాయుడు, తిరుపతినాయుడు ఉన్నారు.

### యోగాతో ఆరోగ్య సిద్ధి



యోగాసనాలను వేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాను సాధన చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చని శిక్షకులు కె.జనార్దరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. చిన్నారులతో తేలికపాటి ఆసనాలు వేయించారు. ఒక్కో ఆసనం విశిష్టత, దానివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు, ఉపాధ్యాయులు జి.మురళి, ఈశ్వరరావు తదితరులున్నారు.

### బహిరంగ మద్యపానం నిషేధం



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై శివప్రసాద్

పాలకొండ రూరల్: బహిరంగంగా మద్యం తాగడం నిషేధం. చట్టరీత్యా నేరమని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. పాలకొండ–సీతంపేట, వీరఘట్టం, విశాఖ రహదారుల్లో ఖాళీ ప్రదేశాలు, రహదారి కల్వర్టు ఖానాలు, శివారు ప్రాంతాల్లో శనివారం మద్యం సేవిస్తున్న పలువురిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై అపరాధ రుసుం విధించారు.

### గృహ నిర్మాణాలపై దృష్టి పెట్టాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలపై సిబ్బంది దృష్టి పెట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. శనివారం తన కార్యాలయంలో సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా లబ్ధిదారుల వివరాలు, నిర్మాణాల తాజా స్థితిగతులపై ఆరాతీశారు. పనులు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది చొరవచూపాలని సూచించారు.

### లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా వెంకటరావు

సాలూరు: లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా కర్రి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు జర్జాపు సూరిబాబు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. కార్యదర్శిగా జగన్మోహన్, కోశాధికారిగా ఈశ్వరరావు కూడా ఏకగ్రీవంగానే ఎన్నిక కాగా వీరందరికీ పట్టణ ప్రముఖులు వాడాడ గణేశ్వరరావు, మండవల్లి సాంబశివరావు, గొర్లె మాధవరావు అభినందనలు తెలిపారు.

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- త్వరలో కిమ్మి–రుషింగి వంతెనను ప్రారంభిస్తాం
- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కళావతి



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కిమ్మి గ్రామంలో శనివారం జరిగిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు జరిగిన సంక్షేమ లబ్ధిని వివరించే బుక్‌లెట్లు అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి పాలనలో మనం ఉన్నందుకు ఎంతో గర్వపడుతున్నట్లు చెప్పారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఓ వృద్ధురాలిని కోరుతున్న ఎమ్మెల్యే కళావతి

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.

**కిమ్మి–రుషింగి వంతెన పరిశీలన**

కిమ్మి గ్రామం వద్ద నాగావళి నదిపై రూ.24.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కిమ్మి–రుషింగి వంతెన పనులను ఎమ్మెల్యే కళావతి పరిశీలించారు. వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు జరగాల్సి ఉందని, రోడ్డు పనులు కూడా చకచకా జరుగుతున్నాయని అక్కడి సిబ్బంది ఆమెకు వివరించారు. త్వరలో సీఎం జగన్ చేతులమీదుగా ఈ వంతెనను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే వీరఘట్టం, వంగర మండలాలకు ప్రయాణం ఎంతో సౌకర్యంగా ఉంటుందని, రెండు మండలాలు విద్య, వ్యాపార పరంగా ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. అంతకుముందు నాగావళి నది ఒడ్డున ఉన్న ఉమాకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కళావతి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ గురాన రామ్మోహనరావు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, పలుశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## గిరిజన మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

కురుపాం: గిరిజన మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్, ఎం.రమణ కోరారు. మండలంలోని నీలకంఠాపురంలో గిరిజన సంఘం 7వ మహాసభల వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. గిరిజనుల హక్కుల సాధనే లక్ష్యంగా జూన్ 16, 17 తేదీల్లో ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీను, కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.

## సమీకృత వ్యవసాయం లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం వెంకట్

జియ్యమ్మవలస: మండలంలోని వెలుగు కార్యాలయంలో రైతులకు సమీకృత వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకట్ మాట్లాడుతూ.. తక్కువ స్థలంలో అన్ని రకాల పంటలను ఏ విధంగా సాగు చేయవచ్చో వివరించారు. గొర్రెలు, మేకలు, పశువుల వ్యర్థాలను పంటకు ఎరువుగా ఉపయోగించడం ద్వారా నేల సారవంతమై పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్ కుమార్, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు హిమరిక చక్రపాణి, వెలుగు సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.


## ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కురుపాం: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అటవీశాఖ బీటు అధికారి కె.ఆనంద్ కోరారు. మంతినివలస గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై శనివారం యువతకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ విచ్ఛిన్నం అయ్యేందుకు వేల సంవత్సరాల సమయం పడుతుందని, ప్లాస్టిక్ సంచులు, బ్యాగులను విచ్చలవిడిగి వినియోగించడం ద్వారా భూమిపై వాటి వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా పర్యావరణానికి, మానవాళికి అనేక విధాలుగా ముప్పు వాటిల్లుతోందని వివరించారు. ప్రజలు ప్లాస్టిక్ సంచులకు బదులు గోనె, కాగితపు సంచులను వినియోగించాలని కోరారు.

## తాగునీటి వృథా..



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తాగునీటి కుళాయి దుస్థితి

పాలకొండ రూరల్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి వద్ద అపరిశుభ్రత నెలకొంది. దీనికితోడు కుళాయిల ట్యాప్‌లు పాడవ్వడంతో నీరు వృథాగా పోతోంది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వేసవికాలం కావడంతో తాగునీటి కోసం కుళాయిల వద్దకు వచ్చిన వారంతా అక్కడి అపరిశుభ్రతను చూసి వాటి నిర్వహణ, అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుళాయిలు బాగుచేయించి, స్వచ్ఛమైన తాగునీటిని ప్రయాణికులకు అందించే ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం



గరుగుబిల్లి: పుస్తక పఠనం ఆవశ్యకతను వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి



భామిని: పిల్లలతో నీతికథలు చదివిస్తున్న లైబ్రేరియన్ సునీత

గరుగుబిల్లి: విద్యార్థులు శాఖాగ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీదేవి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్‌పై అవగాహన కల్పించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను వివరించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. లైబ్రేరియన్ రత్నాలమ్మ, ఎస్.మధుసూదనరావు పాల్గొన్నారు.

– భామిని: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులతో నీతికథలు చదివించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ఉపయోగాలను గ్రంథాలయ అధికారి ఎ.సునీత వివరించారు. పిల్లలకు పురాణాలు, ఇతిహాసాలపై అవగాహ కల్పించారు.

- **గుక్కెడు నీటి కోసం..**



వరద కాలువ నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు, చిన్నారులు

భామిని: గిరిజన గూడల్లో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. మండలంలోని మానగూడ, ఇప్పమానుగూడ, జామిగూడ తదితర గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గిరిజనులు సుదూరంలో ఉన్న వంశధార వరద కాలువ నుంచి నీటికి తెచ్చుకుంటున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని వారంతా కోరుతున్నారు.

### సర్వేకు సిగ్నల్ సమస్య

సీతంపేట: సిటిజన్ అవుట్ రిచ్‌యాప్ సర్వేతో తిప్పలు తప్పడం లేదు. మారుమూల గ్రామాల్లో గ్రామ వలంటీర్లు సర్వే చేస్తున్నప్పటికీ సెల్ సిగ్నల్ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. టిటుకుపాయి, టిటుకుపాయిగూడ తదితర ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది గ్రామస్తులను సెల్‌సిగ్నల్ వచ్చే చోటుకు తీసుకువెళ్లి సర్వే చేస్తున్నారు.

### నకిలీ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ

సీతంపేట: బెంతొరియా కులధ్రువీకరణ పత్రాల మంజూరుపై డీఎల్ఎస్‌సీ సమావేశంలో శనివారం విచారణ చేపట్టారు. నకిలీ బెంతొరియా సర్టిఫికెట్లతో ముగ్గురు ఉద్యోగం చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో వాటిపై విచారణ చేశారు. కంచిలికి చెందిన పూర్ణచంద్రదొలైను ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆయన జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేశారు. దీంతో పాటు మరోరెండు ఆరోపణలపై గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్, ఏపీవో రోషిరెడ్డి, పలాస ఆర్డీవో సీతారామమూర్తి విచారణ చేశారు.

### వైద్యాధికారులకు సర్టిఫికెట్లు అందజేత



వైద్యాధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సీఏసీ శిక్షణ పొందిన వైద్యాధికారులకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి(డీఎంహెచ్ఓ) బి.జగన్నాథరావు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురక్షిత గర్భస్రావం, గర్భ నిరోధక పద్ధతులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి బి.వాగ్దేవి, శిక్షణ కార్యక్రమ నోడల్ అధికారి డీఈఓ టి. జగన్‌మోహన్‌రావు, స్త్రీ, వైద్య నిపుణులు శోభారాణి, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి పాల్గొన్నారు.

## అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జగన్నాథరావు



నేత్ర వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జగన్నాథరావు తెలిపారు. వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగన్నాథపురం ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించి, కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, తగిన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. అంతకుముందు శిబిరానికి హాజరైన వృద్ధుల కళ్లను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన వారిని పుష్పగిరి కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కంటి వెలుగు సెల్ అధికారి, నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామ విద్యను ప్రోత్సహించాలి

- సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న సెట్విజ్ సీఈఓ రామగోపాల్

సీతానగరం: పాఠశాలల్లో విద్యతో పాటు వ్యాయామ విద్యను కూడా ప్రోత్సహించాలని సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య నిర్వహిస్తున్న క్రీడాపోటీలు, వివిధ క్రీడల్లో ఇస్తున్న శిక్షణను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని కోరారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని ఉదహరించారు. వ్యాయామ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ఆయన తనవంతు సాయంగా పలువురు క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో సుస్థిర ఆదాయం



రైతులకు నవధాన్యాల కిట్లను అందజేస్తున్న డీపీఎం పి.షణ్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: సుస్థిర ఆదాయం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమౌతుందని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు రైతుభరోసా కేంద్రం వద్ద శనివారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 మంది రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం డీపీఎం మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని, వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు రావన్నారు. నవధాన్యాల విత్తనాలను తొలకరి వర్షాలకు ముందు నాటుకోవాలని, 45 రోజుల తర్వాత పంటను భూమిలో కలియదున్నడం ద్వారా అందులోని సేంద్రియ పదార్థాలు నేలను చేరి పొలం సారవంతంగా మారుతుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్‌తో పాటు జట్టు సంస్థ సంయుక్తంగా గుమ్మలక్ష్మీపురం మండలంను శాతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జట్టు సంస్థ ప్రతినిధులు ఎం.సీతారాం, పి.జగదీష్, టి.మన్మథరావు, పి.శ్రావణి, ఎస్.లత తదితరులున్నారు.

## పాఠశాలల పునఃప్రారంభం నాడే విద్యాకానుకల పంపిణీ



యూనిఫాంలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం నాడే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయనున్నట్లు డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జగనన్న విద్యాకానుక కిట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 12,083 పాఠ్యపుస్తకాలు, 4,024 మంది విద్యార్థులకు యూనిఫాంలు వచ్చాయన్నారు. ఇంకా బ్యాగులు, నోట్‌పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాల భవనాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండో విడతలో చేపట్టిన నాడు–నేడు పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ వై.శంకరరావు, హెచ్ఎం ఎస్.పాత్రుడు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

# వలంటీర్లు సంక్షేమ వారధులు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి

కొమరాడ: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ వారధులు వలంటీర్లు అని ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. మండల కేంద్రం కొమరాడతో పాటు మరో ఐదు సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంతో పాటు పాలనలో పారదర్శకత తీసుకొచ్చారన్నారు. వలంటీర్లు మరింత మెరుగ్గా సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదనరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# సవర భాషను కాపాడుకుందాం

భామిని: ఆదివాసీల మాతృభాషగా గుర్తింపు పొందిన సవర భాషను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలని అక్షర బ్రహ్మ మతార్పనం విజ్ఞాన ప్రచార ఆశ్రమం కేంద్ర కమిటీ కార్యదర్శి రాంప్రసాద్ గుమాంగో పిలుపునిచ్చారు. మండలంలోని సతివాడ సమీపంలోని నూకాలమ్మగూడలో శనివారం అక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘ ఆశ్రమం 9వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మారుతున్న విద్యా విధానంలో సవర భాషను కొనసాగించి, గిరిజన సాంప్రదాయాలు, సంస్కృతులను కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఆదివాసీ గిరిజన విద్యార్థులు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. ముందుగా అక్షర బ్రహ్మ ఆవిష్కర్త మంగయ్య గుమాంగో చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యువ నిర్మాణ సేవా సంఘ జిల్లా కోఆర్డినేటర్ సవర కరువయ్య, మతార్పన్ ప్రచారకులు, అక్షర బ్రహ్మ బోధకులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

కొమరాడ: చిన్నారుల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి, చంద్రంపేట, తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో 2 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లల ఆరోగ్య వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. వారికి సకాలంలో టీకాలు వేయాలన్నారు. 9 నెలలు నిండిన పిల్లలకు మిజుల్స్ రుబిల్లా వ్యాక్సిన్ మొదటి డోసు, 16 నెలలు పూర్తయిన వారికి రెండో డోసు తప్పనిసరిగా వేయాలన్నారు. పిల్లల వయస్సు, బరువు, ఇతర ఆరోగ్య వివరాలతో హెల్త్ రికార్డు నిర్వహించాలన్నారు.